# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 28-12-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:109 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

ఉన్మిషిత మానసుండగు
మన్మోహన సింగు గారి మరణమ్మునకున్
ముమ్మందుగ ఖేదపడుచు
సన్మాన్యుని మదిన దలతు సంతాపముతోన్ !!

మన్మోహన్ సింగ్ గారి మృతికి సంతాపం



-రాధశ్రీ

**చురక**

ఆకలితో ఉన్నోడికి
అనివార్యం భుక్తి
అప్పనంగ తిన్నోడికి
అక్రమాలే శక్తి
శ్రమించినా కొందరికి
చేజిక్కదు ఫలితం
అందుకొరకే ఆందోళన
ఆగ్రహాలు జ్వలితం



-వేల్పుల నారాయణ
9440433475

# మన్మోహన్ సింగ్‌కు రాష్ట్రపతి ముర్ము నివాళి



న్యూఢిల్లీ, డిసెంబర్ 27:ఆర్థిక సంస్కరణల రూపకర్త, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నివాళులర్పించారు. మన్మోహన్ నివాసానికి చేరుకున్న రాష్ట్రపతి ముర్ము.. అక్కడ మాజీ ప్రధాని పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరోవైపు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ కూడా మన్మోహన్‌కు నివాళు

# ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేసిన మన్మోహన్ సింగ్: ప్రధాని మోడీ



న్యూ ఢిల్లీ ఎక్స్ ప్రెస్ న్యూస్ న్యూస్ );: ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి ప్రధాని నరేంద్ర మోడీ నివాళులర్పించారు. మన్మోహన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మోడీ మీడియాతో మాట్లాడారు. ఆర్‌బిఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో సేవలందించారని కొనియాడారు. పివి హయాంలో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారని, దేశం, ప్రజలపట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినదని మోడీ ప్రశంసించారు. విలక్షణ పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలు అందించారని, ఎన్నోకీలక పదవులు అధిష్టించినా సాధారణ జీవితం గడిపారన్నారు. జాతీయం, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడానని, తన తరపున, దేశ ప్రజల తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని మోడీ స్పష్టం చేశారు.

# మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించేందుకు సీడబ్ల్యూసీ సమావేశం




న్యూఢిల్లీ, డిసెంబర్ 27: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు శ్రద్ధాంజలి ఘటించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమైంది. కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్మన్ సోనియా గాంధీ , లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తోపాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

మన్మోహన్ సింగ్ మృతికి సీడబ్ల్యూసీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. సీడబ్ల్యూసీ నేతలు మన్మోహన్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంది.

# మన్మోహన్ సింగ్ ఆస్తుల విలువ రూ.15 కోట్ల 77 లక్షలు

న్యూఢిల్లీ డిసెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్(92) నిన్న రాత్రి తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. రేపు ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. 2004 నుంచి 2014 వరకు దేశ ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ చాలా సాదాసీదా జీవితాన్ని గడిపారు. ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా తన పదవిలో కొనసాగారు. చాలా తక్కువగా మాట్లాడుతూ.. దేశానికి ఎన్నో ఉపయుక్తమైన సేవలందించారు.

ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు.మన్మోహన్ సింగ్ ఆస్తుల గురించి చెప్పాలంటే? ఆయన ఆస్తుల విలువ రూ.15 కోట్ల 77 లక్షలు. రాజ్యసభలో ఇచ్చిన అఫిడవిట్ ప్రకారం.. ఢిల్లీ, చండీగఢ్‌లో ఆయనకు ఫ్లాట్ మాత్రమే ఉంది. అఫిడవిట్ ప్రకారం మన్మోహన్ సింగ్‌కు ఎలాంటి అప్పులు లేవు. డాక్టర్ మన్మోహన్ సింగ్ వినయం, పని పట్ల నిబద్ధతత చాటుకొని రాజకీయ నాయకులకు రోల్‌మోడల్‌గా నిలిచారు. ప్రధాని పదవి నుంచి తప్పుకున్న తర్వాత క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. ప్రధానమంత్రి పదవిని వీడిన తర్వాత మన్మోహన్ సింగ్ తన భార్యతో నివసిస్తున్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్, భార్య గురుశరణ్ కౌర్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

# మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించిన సోనియా, ఖర్గే, రాహుల్, ప్రియాంక





న్యూఢిల్లీ, డిసెంబర్ 27:మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పిస్తున్నారు ఇప్పటికే రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు నివాళులర్పించిన విషయం తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకులు మాజీ ప్రధానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సోనియా గాంధీ , రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ వాద్రా, రాబర్ట్ వాద్రా ఇవాళ ఉదయం మన్మోహన్ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా దేశానికి మన్మోహన్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

# ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించిన మన్మోహన్ సింగ్

న్యూఢిల్లీ డిసెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఒక మలుపు తిప్పిన ఆర్థిక మంత్రిగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చరిత్రలో నిలిచిపోయారు. దేశ ఆర్థికాభివృద్ధిలో ఆయన తనదైన ముద్ర వేశారు. దేశానికి సరికొత్త దశ, దిశ చూపిన ప్రధానిగా రికార్డులోకి ఎక్కారు మన్మోహన్ సింగ్. సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ అనే మూడు విభాగాల్లో కీలక మార్పులు తీసుకొచ్చారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు.దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో అప్పటి ఆర్థిక మంత్రిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ సాహసోపేతమైన నిర్ణయం దేశ దిశను మార్చేసింది. భారతదేశాన్ని రక్షించడానికి ఆర్బీఐ(రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)కి చెందిన 44 టన్నుల బంగారాన్ని తాకట్టు పెట్టి చరిత్ర సృష్టించారు. నిజానికి 1991లో భారతదేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు కేవలం 1.2 బిలియన్ డాలర్లకు తగ్గాయి. ఈ నిల్వ కేవలం మూడు వారాల దిగుమతులకే సరిపోతుంది. గల్ఫ్ యుద్ధం ముడి చమురు ధరల పెరుగుదలకు దారితీసింది. ఇది భారతదేశంపై దిగుమతుల ఒత్తిడిని మరింత పెంచింది. భారతదేశం వివిధ అంతర్జాతీయ సంస్థల నుంచి భారీ రుణాలు తీసుకుంది. దాని కోసం తిరిగి చెల్లించడానికి విదేశీ మారకద్రవ్యం నిండుకున్నాయి.

ఇక తప్పని పరిస్థితుల్లో బంగారం తాకట్టు..!

1980లలో తీసుకున్న ఆర్థిక విధానాలు భారతదేశాన్ని అప్పుల్లోకి, అధిక ఆర్థిక లోటులోకి నెట్టాయి. అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు నేతృత్వంలో ఆర్థిక మంత్రిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ 44 టన్నుల బంగారాన్ని తాకట్టు పెట్టింది. ఈ బంగారాన్ని స్విట్జర్లాండ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు పంపారు. ఇది భారతదేశానికి $600 మిలియన్ల రుణాన్ని పొందేందుకు సహాయపడింది. ఈ డబ్బును విదేశీ అప్పులు చెల్లించడానికి, దిగుమతులు నిర్వహించడానికి ఉపయోగించారు. బంగారాన్ని తాకట్టు పెట్టడం అవమానకరమైన పరిస్థితిగా పరిగణించారు. ఎందుకంటే బంగారం భారతదేశం ఆర్థిక శ్రేయస్సు, సాంస్కృతిక చిహ్నం. ఈ నిర్ణయం ప్రజలతోపాటు రాజకీయ నాయకుల్లో విమర్శలు ఎదుర్కొంది. ఇది కఠినమైన చర్య అయినప్పటికీ, ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి సహాయపడింది.

ఆర్థిక సరళీకరణ ప్రక్రియ ప్రారంభం..

బంగారాన్ని తాకట్టు పెట్టిన తర్వాత, మన్మోహన్ సింగ్ 1991లో భారత ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి ఆర్థిక సరళీకరణ ప్రక్రియ ప్రారంభించారు. ప్రపంచ పెట్టుబడులు, పోటీకి భారత మార్కెట్లు ద్వారాలు తెరిచాయి. లైసెన్స్ రాజ్ రద్దు చేశారు. విదేశీ కంపెనీలు భారత మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు అనుమతించారు. దిగుమతి-ఎగుమతి నియమాలు సరళీకృతం చేశారు. ఆ తర్వాత భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందింది. భారతదేశం అభివృద్ధి చెందుతున్న ప్రపంచశక్తిగా చ వా డ ట ం ప్రారంభించింది.బంగారాన్ని తనఖా పెట్టడం భారతదేశ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టం. మన్మోహన్ సింగ్ తీసుకున్న ఈ నిర్ణయం వల్లనే భారతదేశం నేడు బలమైన, స్థిరమైన ఆర్థిక శక్తిగా మారింది.

# వైసీపీకి మరో షాక్.. రాజకీయాలకు మాజీ ఐఏఎస్ గుడ్ బై !



అమరావతి, డిసెంబర్ 27:వైసీపీకి మరో షాక్ తగిలింది. ఇప్పటికే పలువురు కీలక నేతలు పార్టీకి రాజీనామా చేయగా.. తాజాగా మరో నేత పార్టీకి గుడ్ బై చెప్పారు. వైసీపీకి మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ రాజీనామా చేశారు. రాజకీయాలకు గుడ్ బై చెప్పాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు.

ఐఏఎస్ అధికారిగా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని ఎన్నికల ముందు వైసీపీలో చేరిన ఇంతియాజ్ కర్నూలు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు.

అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్న ఇంతియాజ్ ఇప్పుడు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా లేఖను పార్టీ అధినేత జగన్‌కు పంపించారు.

# కాల్వలో పడ్డ బస్సు.. 8మంది దుర్మరణం..



పంజాబ్, డిసెంబర్ 27: బఠిండాలో ఘోర ప్రమాదం జరిగింది. వంతెనను రెయిలింగ్ను ఢీకొట్టిన బస్సు.. కాల్వలో పడింది. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా, మరో 18 మంది గాయపడ్డారు. జీవన్ సింగ్ వాలా గ్రామ సమీపంలో ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా, ముగ్గురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మరణించారు.

క్షతగాత్రులు షహీద్ భాయ్ మణి సింగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. 50 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్న బస్సు సర్దుల్గఢ్ నుండి బఠాండాకు వెళ్తుండగా జీవన్ సింగ్ వాలా దగ్గర కాలువలో పడడంతో ఈ ప్రమాదం జరిగింది. ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు, స్థానికుల సహకారంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా

హైదరాబాద్ డిసెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణను నాంపల్లి కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి పోలీసులు సమయం కోరారు. సంధ్య థియేటర్ ఘటనలో నాంపల్లి కోర్టులో జరిగిన విచారణకు వర్చువల్‌గా అల్లు అర్జున్ హాజరయ్యారు. విచారణను జనవరి 10కి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. గతంలో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. రిమాండ్ గడువు ముగియడంతో కోర్టు ముందుకు అల్లు అర్జున్ హాజరయ్యారు. డిసెంబర్ 4న ఆర్ టిసి క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్ లో పుష్ప 2 సినిమా విడుదల కావడంతో పాటు హీరో అల్లు అర్జున్ అక్కడికి రావడంతో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి కేంద్ర క్యాబినెట్ సంతాపం

హైదరాబాద్, డిసెంబర్ 27:భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి కేంద్ర క్యాబినెట్ సంతాపం తెలిపింది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ సంతాప తీర్మానం చేసింది. క్యాబినెట్ సమావేశంలో మన్మోహన్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. వచ్చే నెల 1వ తేదీ వరకు ఏడు రోజులపాటు సంతాప దినాలుగా ప్రకటించారు. ఈ మేరకు కేంద్రం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

ఈ ఏడు రోజులపాటు దేశవ్యాప్తంగా, విదేశాల్లోని ఇండియన్ మిషన్స్, రాయబార కార్యాలయాల్లో జాతీయజెండాను సగం వరకు ఎగురవేయనున్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని నిర్ణయించారు. అంత్యక్రియల రోజు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు హాఫ్ డే సెలవు ప్రకటించారు.

మన్మోహన్ సింగ్ మృతిపట్ల క్యాబినెట్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో గురువారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో కన్నుమూశారు. మన్మోహన్ సింగ్ 1932 సెప్టెంబర్ 26న పశ్చిమ పంజాబ్‌లోని గాహ్‌లో జన్మించారు. 1954లో పంజాబ్ యూనివర్సిటీ నుంచి అర్థశాస్త్రంలో మాస్టర్ డిగ్రీ పూర్తిచేశారు. 1962లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆయన డాక్టరేట్ ఇచ్చింది.

చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో సీనియర్ లెక్చరర్‌గా మన్మోహన్ సింగ్ తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత అదే యూనివర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్ అయ్యారు. అనంతరం ఢిల్లీ యూనివర్సిటీలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఇంటర్నేషనల్ ట్రేడ్ ప్రొఫెసర్‌గా చేరారు. ఆ తర్వాత కేంద్ర ఆర్థిక శాఖలో వివిధ హోదాల్లో ఆయన పనిచేశారు. ప్లానింగ్ కమిషన్ మెంబర్ సెక్రెటరీగా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు.




